క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి



హరీశ్‌రావుకు శుభాకాంక్షలు చెప్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మాజీ మంత్రి హరీశ్‌రావును ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీలను కలసిన బీజేపీ నేతలు



ఈటలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేశ్‌గౌడ్

ములుగు(గజ్వేల్): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావును మండలంలోని కొత్తూరు మాజీ సర్పంచ్, బీజేపీ నేత చెట్టి సురేశ్‌గౌడ్, పలువురు నేతలు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎంపీలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

'మార్కెట్ కమిటీ' పూజలు



మార్కెట్ కమిటీ పాలకవర్గంతో అర్చకులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామిని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నేతలు బుధవారం దర్శించుకున్నారు. చైర్మన్ కంది తిరుపతిరెడ్డి స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను దశలవారీగా అమలు చేస్తోందని, అలాగే సన్నవడ్లకు రూ.500లు బోనస్ ఇచ్చిందని చెప్పారు. సంక్రాంతికి రైతు భరోసా ఇవ్వబోతుందని చెప్పారు. అర్చకులు పాలక వర్గ ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చందు, డైరెక్టర్లు శ్రీనివాస్, బాలయ్య, యాదవరెడ్డి పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి



గోలీసోడాను ఆవిష్కరిస్తున్న కిషోర్ తదితరులు

గజ్వేల్‌రూరల్: యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గజ్వేల్ బ్రాంచ్ మేనేజర్ కిషోర్ పసునూరి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో బుధవారం 'ఆహా గోలీ సోడా'కు సంబంధించిన పాకెట్ ఫ్రెండ్లీ బాటిల్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి పొంది పది మందికి ఉపాధి కల్పించాలన్నారు. నిజాయితీగా రాణించే వారికి రుణసౌకర్యం కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది తరుణ్, సాయికుమార్, రమేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



అల్పాహారం పంపిణీ

గజ్వేల్: లయన్స్ క్లబ్ పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ప్రశంసించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో బుధవారం 184వ అల్పాహార పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. క్లబ్ సేవలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ గోలీ సంతోష్, స్నేహ అధ్యక్షుడు మల్లేశం, లయన్ సత్యనారాయణ, పరమేశ్వరచారి, నేతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు వెళ్లేదెలా?

ఆరుబయటే మాంసం విక్రయాలు
- మార్కెట్ నిర్మించినా నిరుపయోగం
- రోడ్డుపైనే వ్యర్థాలు, కుక్కల వీరవిహారం
- ఇబ్బందులు పడుతున్న భక్తులు



రోడ్డుపైనే అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు

దుబ్బాకటౌన్: దుబ్బాకలో సమీకృత మాంసాహార, శాఖాహార మార్కెట్ ఉన్నప్పటికీ ఆరుబయటే మాంసం విక్రయాలు నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంలో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక 18వ వార్డులో దాదాపు రూ.80లక్షల నిధులతో మున్సిపల్ ఆధ్వర్యంలో కూరగాయలు, మాంసం, చేపల విక్రయం కోసం మార్కెట్ నిర్మించారు. కానీ మాంసం విక్రయదారులు మార్కెట్ బయట విక్రయిస్తున్నారు.

కుక్కల బెడద.. భక్తుల ఇబ్బందులు

మార్కెట్ బయట, రొడ్డుపైనే విక్రయాలు సాగుతున్న కారణంగా కుక్కల బెడద విపరీతంగా పెరిగింది. ఆ ప్రాంతంలో వీర విహారం చేస్తున్నాయి. దీంతో అటుగా వెళ్తున్న వారు భయ భ్రాంతులకు గురవుతున్నారు. అక్కడికి దగ్గరలో ఉన్న వివిధ ఆలయాలకు వెళ్లే భక్తులు కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఆరుబయట విక్రయాలు నిర్వహించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ప్రతినిధులు మున్సిపల్ ఏఈ శ్రీకాంత్‌కు ఇటీవల వినతిపత్రం అందించారు. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని, స్థానికులు, భక్తులకు సహకరించాలని కోరారు.

ఇబ్బందులు పడుతున్నాం ..



మాంసం విక్రయాలు ఆరుబయట, రోడ్డుపై జరపడంతో మాంసం వ్యర్థాలు రోడ్లపైనే పారవేస్తున్నారు. వాటిని దాటుకుంటూ ఆలయాలలోకి వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంది. విక్రయాల కోసం నిర్మించిన మార్కెట్లో అమ్మకాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీరామ్ తిలక్ చందర్, విశ్వహిందూ పరిషత్, టౌన్ అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం ..



ఇటీవలే ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. మాంసం విక్రయాలు మార్కెట్‌లో జరిగేలా చర్యలు తీసుకుంటాం. మాంసం విక్రయించే వారు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు.

– రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

ముత్యంరెడ్డి సేవలు మరువలేనివి

మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



తొగుట(దుబ్బాక): మాట్లాడుతున్న మైనంపల్లి హనుమంతరావు

తొగుట(దుబ్బాక)/మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాక టౌన్: స్వర్గీయ మాజీ మంత్రి ముత్యంరెడ్డి జయంతి సందర్భంగా బుధవారం పలు మండలాల్లో వేడుకలు నిర్వహించారు. తొగుట మండల పరిధిలోని బండారుపల్లి మదిర గ్రామం మెట్టు వద్ద ముత్యంరెడ్డి విగ్రహాన్ని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకు ముత్యంరెడ్డి దుబ్బాక నియోజకవర్గానికి ముత్యం రెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఎక్కడా జరగని అభివృద్ధి చేసి చూపించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పూజల హరికృష్ణ, స్వామి, వెంకట్ స్వామి గౌడ్, విజయ్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ మాట్లాడారు. దుబ్బాకలో నూతన వ్యవసాయ పద్ధతులను తీసుకువచ్చి రైతు బాంధవుడిగా వెలుగొందారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సుమలత, చంద్రశేఖర్, శంకర్, నారాయణ, శ్రీనివాస్‌గౌడ్, అనిల్, చందు, వెంకటేశం, సురేందర్ రెడ్డి, స్వామి, యాదయ్య, నిజామొద్దీన్, పున్నవ్వ, విజయ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొంగరి రవి ముత్యంరెడ్డి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రాజిరెడ్డి, నరేందర్, భరత్, రాజశేఖర్, చంద్రారెడ్డి తదితరులున్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

టూటౌన్ సీఐ ఉపేందర్



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఉపేందర్, సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తాత్కాలిక ఆనందం కోసం జీవితాలు నాశనం చేసుకోవద్దని టూటౌన్ సీఐ ఉపేందర్ పిలుపునిచ్చారు. కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో మత్తు పదార్థాల నివారణలో భాగంగా బుధవారం నార్కొటిక్ డాగ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లలు గంజాయి ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు కలిగిఉన్నా.. విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాలలలో మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్‌లు విక్రయిస్తే చర్యలు తప్పవని, ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబరు 1908కి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ రాజేశం, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అండగా ఉంటాం

మిరుదొడ్డి(దుబ్బాక: పేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎల్లవేళలా అండగా ఉంటామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పిట్ల మణెమ్మ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించి 50కిలోల బియ్యం అందిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అయన వెంట పెద్దబాబు, మల్లయ్య, స్వామి, చంద్రం, కనకయ్య తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో 'సత్యసాయి' ఆదర్శం

ఎస్ఐ శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): సత్యసాయి ట్రస్టు సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుస్తోందని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. కుకునూరుపల్లిలో భగవాన్ సత్యసాయి భజన 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ట్రస్టు సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత నివ్వండి



భూమిపూజ చేస్తున్న నాయకులు

పద్మశాలి సంఘం నేతలు

గజ్వేల్‌రూరల్: చేనేతరంగానికి చేయూతనిచ్చి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం నేతలు కోరారు. పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం నేతన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతకు ఆదరణ కరువై నేత కార్మికులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను అందించాలని, నేత వస్త్రాలను కొనుగోలు చేసి అండగా నిలవాలని కోరారు. అనంతరం సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజారాం, భాస్కర్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రాజేశం, బాల్‌చంద్రం, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ బారిన పడొద్దు



హేమరాజ్‌సింగ్

దుబ్బాక: యువత డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువత మంచి లక్ష్యాలను ఏర్పర్చుకొని ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్ బారిన పడినవారు ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా చాలా అవస్థలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ నూతన సంవత్సరంలో డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత నడుంబిగించాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి శ్రీసింగరాల మల్లన్న ఆలయం వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు. పీసీసీ మత్స్యకార కార్యదర్శి రేపాక తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు భూపాల్‌రెడ్డి, నిరంజన్, నరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

రైల్వేబ్రిడ్జికి బసవేశ్వరుడి పేరు పెట్టాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి మహాత్మా బసవేశ్వరుడి పేరు పెట్టాలని లింగాయత్ సమాజ్ నాయకులు కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో జహీరాబాద్ లింగాయత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి సుభాష్ మాట్లాడారు. విశ్వగురువు బసవేశ్వరుడు 800 సంవత్సరాల క్రితం జాతి వర్గ వర్ణ రహిత సమ సమాజ నిర్మాణానికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్తన్నారు.

నాచగిరిలో భక్తుల సందడి



శ్రీలక్ష్మీనరసింహ స్వామి



కిక్కిరిసిన భక్తులతో క్యూలైన్

- భక్తులతో కిక్కిరిసిన నృసింహక్షేత్రం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం బుధవారం నూతన సంవత్సర శోభతో అలరారింది. భక్తులతో కిక్కిరిసింది. హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. స్వామివారి దర్శనానికి గంటన్నరపైగా సమయం పట్టింది.

కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి.. సంక్షేమం

పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు అని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్ర ఖజానాను దోచుకున్నారన్నారు. మహిళలు, దళితులకు భద్రత కరువైందని, ఇప్పుడు అలాంటి చింతన లేకుండా ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉన్నారని చెప్పారు. యువత పక్కదారి పట్టకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రగ్స్‌ను కట్టడి చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక విజన్‌తో ఆయన అన్నివర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తున్నారని, ముఖ్యమంత్రిని విమర్శించే ముందు బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హితబోధ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులు చేసిన అక్రమాలు ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజొద్దీన్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీం, ఫయాజొద్దీన్, ఫయాజ్, రాకేశ్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా పడిపూజ



జ్యోతిని వెలిగిస్తున్న వెంకట్

హుస్నాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. స్వామి కీర్తనలు, భజనలతో ఆలయం మారుమోగింది. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. దాతల సహకారంతో 41రోజులుగా చేపట్టిన నిత్యాన్నదానం బుధవారంతో ముగిసింది. చివరి రోజు భిక్ష కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, గురుస్వాములు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శ్రీధర్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మున్నూరుకాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. స్థానిక కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, దుర్గయ్య, నర్సింహులు, సమ్మయ్య, బాల మల్లయ్య, లక్ష్మణ్, వెంకటేశం, కిష్టయ్య, వెంకటేష్, వంశీధర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

డప్పులు, టీ షర్టుల పంపిణీ



డప్పులు, టీ షర్టులను అందజేస్తున్న శ్రీనివాస్

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మిట్టపల్లి అంబేడ్కర్ సంఘం సభ్యులకు పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ బుధవారం డప్పులు పంపిణీ చేశారు. తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు ఐలయ్య జ్ఞాపకార్థం తమ్ముడు మాజీ ఉప సర్పంచ్ సంతోష్‌తో కలిసి 24మందికి డప్పులతో పాటు టీ షర్టులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పయ్యావుల రాములు, మాజీ ఎంపీటీసీ అంకుశావలీ, నాయకులు కనకమల్లయ్య, జేపీ యాదవ్, గిరి, ప్రసాద్, మామిండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన కొత్త జోష్

- ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు
- కేక్‌లు కట్‌చేసుకొని సందడి
- ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు

కొత్త సంవత్సర వేడుకలు జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. యువతీయువకులు కేకులు కట్‌చేసి 2025కు ఘనంగా స్వాగతం పలికారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని పట్టణాలు, గ్రామాల్లో సందడి చేశారు. మహిళలు ముగిళ్లల్లో రంగురంగుల ముగ్గులు వేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రధాన ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



చేర్యాల(సిద్దిపేట): షాలేము ప్రార్థనా మందిరంలో చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న విజయ్‌కుమార్



జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మను దర్శించుకొంటున్న భక్తులు



నంగునూరు(సిద్దిపేట): వేంకటేశ్వరాలయంలో గోపూజ చేస్తున్న అర్చకుడు



చిన్నకోడూరు(సిద్దిపేట): న్యూ ఇయర్ ముగ్గు వేస్తున్న చిన్నారి



మద్దూరు(హుస్నాబాద్): రామలింగేశ్వర ఆలయంలో భక్తుల పూజలు



హుస్నాబాద్: ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత తదితరులు